క్లుప్తంగా

ఓటరు కార్డుల పంపిణీ



ధన్వాడ: కొత్తగా ఓటరు కార్డుకోసం దరఖాస్తు చేసుకున్న వారికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు కార్డులను పంపిణీ చేశారు. శుక్రవారం పోస్టాఫీస్ సిబ్బంది ప్రతి గ్రామంలో ఓటరు కార్డులను పంపిణీ చేశారు. గున్ముక్లలో సిబ్బంది ఉమాదేవి ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షాజాహబేగం తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కోసం యువత కలిసిరావాలి

మరికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకోసం యువత కలిసి రావాలని యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, ప్రధాన కార్యదర్శి రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఇక్కడి ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కోసం వస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల ఎదుట కళాశాల ప్రస్తవన తీసుకురావాలన్నారు. జూనియార్ కళాశాల మంజూరు చేస్తామని వారిచే హామీ తీసుకోవాలన్నారు. ప్రచారం కోసం వస్తున్న అభ్యర్థుల దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామ యువత ముందుకు రావాల్సినా అవసరం ఎంతైనా ఉందన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభించినట్లు సీఐ రవిబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా ఆస్పత్రి సమీపంలోని షెడ్‌లో చనిపోయి ఉన్న మహిళ శవం ఉన్నట్లు అటుగా వెళ్తున్నవారు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీస్ బృందం సభ్యులు మతిస్థిమితం లేని మహిళగా గుర్తించారు. సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని, తెలుపు, నీలం రంగు చీర ధరించిందని చెప్పారు. 8172670404కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుంతలమయంగా రోడ్డు



మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యరం సమీపంలో కోల్పూర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. మందిపల్లి రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. వర్షానికి గుంతలో నీరు నిలుస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఈ గుంతలో పడి బట్టలు, పుస్తకాలు పాడైపోతున్నాయి. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బూడిదలారీ బోల్తా..



మక్తల్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ వద్ద రాయిచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బూడిద లారీ బోల్తాపడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రాయిచూర్ నుంచి బూడిద లారీ హైదరాబాద్‌కు తెల్లవారు జామున వెళ్తున్న సమయంలో కొందరు వ్యక్తులు టీ పాయింట్ వద్ద టీ తాగుతున్న సమయంలో అక్కడే నిల్చున్న కారుకు తగలడంతో బోల్తాపడింది. టీపాయింట్, కారు వెనుక బాగన తగలడంతో ఎవరికి ప్రమాదం జరుగలేదు. టీ పాయింట్ వద్ద ఉన్న వారికి గాయాలైయ్యాయి. అక్కడ ఉన్నవారు పరుగెత్తడంతో ప్రమాదం తప్పింది. బూడిదలారీ బోల్తాపడి ఉంటడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా భవనం

మాగనూర్: గృహనిర్మాణ సంస్థ సహాయక ఇంజనీర్ కార్యాలయం భవనం నిరుపయోగకరంగా మారింది. గతంలో గృహనిర్మాణానికి సంబంధించిన శాఖ అవసరాల నిమిత్తం ఒక భవనాన్ని నిర్మించగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ శాఖ అధికారులను ఇతర శాఖలో కల్పివేయడంతో పదిసంవత్సరాలుగా భవనం నిరుపయోగకరంగా మారింది. అయితే ప్రస్తుతం మండలంలో వివిధ అవసరాలకు భవనాల కొరత ఉందని ఆ భవనాన్ని ఇతర శాఖల అధికారులకు కేటాయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువతతోనే మార్పు..

ఊట్కూర్:యువతతోనే రాజకీయాల్లో మార్పు సాధ్యమని స్వతంత్ర అభ్యర్థి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం నామినేషన్ల చివరి రోజు ఊట్కూర్‌కు చెందిన యువకుడు అనిల్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను మక్తల్‌లో రిటర్నింగ్ అధికారి మయాంక్‌కు అందజేశారు.

వంతెన లేక అవస్థలు

- నిత్యం పారుతున్న నీటితో రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న తళంకేరి గ్రామస్తులు
- హైలెవల్ వంతెన నిర్మించాలని వేడుకోలు



నీటి ప్రవాహంలో వాగు దాటుతున్న రైతులు (ఫైల్)

మాగనూర్: మండలంలోని తళంకేరి గ్రామస్తులను వాగు కష్టాలు వెంటాడుతున్నాయి. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నిత్యం వాగులోకి నీరు వస్తుండటంతోపాటుపై నుంచి నిరంతరం వాగులోకి నీరు వస్తుండటంతో చిన్నవాగు నిరంతరం పారుతుంది. దీంతో మండలంలోని తళంకేరి– నేరడగండొడ్డి గ్రామాల రాకపోకలకు ఈ వాగు అడ్డుగా మారింది. దీంతో అత్యవసర సమాయల్లో, విద్యార్థులు, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిపోతున్న రాకపోకలు..

తళంకేరి– నేరడగండొడ్డి గ్రామాల మధ్యలోని వాగుపై గతంలో లోలెవల్ వంతెన నిర్మించారు. అయితే అది నిర్మాణం పూర్తయి మొదటి వరదకే కొట్టుకుపోయింది. దీంతో దాదాపుగా 11సంవత్సరాల నుంచి రాకపోకలు లేక ఇరు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తళంకేరి నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరి దారుణంగా తయారైంది.

అన్నదాతల అవస్థలు..

తళంకేరికి చెందిన పలువురు రైతుల పంటపొలాలు వాగుకు అవతలి పక్కన ఉన్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతినిత్యం వాగులో నుంచి వెళ్లక తప్పదు. వాగుప్రవాహం ఉన్న సమయంలో పనులు మానుకుంటున్నారు. నీరు తక్కువగా ఉన్న సమయంలో తప్పనిసరి పరిస్థితిలో వెళ్తూ ప్రమాదాల పాలవుతున్నారు. చాలాసార్లు వంతెన విషయమై ఉన్నతాధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించి ప్రజల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి..



సుమారు 50మంది రైతుల పొలాలు వాగుకు అవతలివైపు ఉన్నాయి. వాగుప్రవా హం అధికంగా ఉన్న రోజుల్లో పదిహేను కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్తున్నాం. సంబంధిత అధికారులు కొత్త వంతెన నిర్మించి, ఇబ్బందులు తొలగించాలి.

– రాజు, తళంకేరి గ్రామస్తుడు

వాహనాలు రావడం లేదు..



వాగు ప్రవహిస్తున్న రోజుల్లో తళంకేరి మీదుగా నేరడగండొడ్డి గ్రామానికి ఎటువంటి వాహనం రావడం లేదు. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించి దూరభారం తగ్గించడంతో పాటు ఇబ్బందులు తొలగించాలి.

– రామస్వామి, సర్పంచ్, తళంకేరి

ప్రతిపాదనలు పంపించాం..



తళంకేరి– నేరడగండొడ్డి గ్రామాల మధ్య నెలకొన్న వంతెన సమస్యపై ఉన్నతాధికారులకు ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. వంతెన నిర్మాణానికి రూ. 12 కోట్లు నిధులు అవసరం ఉన్నట్లు ప్రాథమిక అంచనకు వచ్చాం. నిధులు మంజూరైన వెంటనే వంతెన పనులు ప్రారంభిస్తాం.

– విలోక్, పీఆర్ఏఈ, మాగనూర్

పర్యావరణాన్ని కాపాడుకుందాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కోస్గి: పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా దీపావళి పండుగను జరుపుకుంటామని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో 'పర్యావరణ హితంగా సురక్షిత దీపావళి వేడుక' పేరుతో విద్యార్థులకు అవగాహన ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం దీపావళి రోజున జరిగే శబ్ద కాలుష్యం, పొగతో వాతావరణ కాలుష్యం ఏర్పడి పర్యావరణంలోని మొక్కలు, జంతువులు వివిధ రకాలుగా ఇబ్బందులకు గురయ్యే ప్రక్రియను ప్రొజెక్టర్ ద్వారా చిత్రాలతో సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు ఇదే అంశంపై ప్రమాదం లేని టపాసులను కాల్చి విద్యార్థులకు ప్రత్యేక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



మందిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: ధన్వాడ మండలంలోని ఆయాగ్రామాల్లో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు వాహిద్, జెడ్పీటీసీ విమల, మండల ఇన్‌చార్జి రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా దామరగిద్దలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి ప్రజలను కోరారు. అలాగే మరికల్‌లో మండలంలో అప్పంపల్లి, పల్లెగడ్డ, తీలేర్ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే ఎ. రాజేందర్‌రెడ్డి ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

నారాయణపేట రూరల్: పట్టణంలోని 22వ వార్డు, మండలంలోని జాజాపూర్, శ్యాసన్‌పల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి రతంగపాండురెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. ప్రధాని మోదీనాయకత్వంలో డబల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

జోరుగా ప్రచారం..

మక్తల్: నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీఎంపీ జితేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు ముఖ్యఅతిథిగా వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మాగనూర్: మండల పరిధిలోని శుక్రవారం ఆయాగ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

నర్వ: రైతుసమన్వయ సమతి జిల్లా అధ్యక్షురాలు చిట్టెం సుచరిత ఆధ్వర్యంలో యాంకిలో మండల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీవెంకటయ్య దంపతులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో..

సాక్షినెట్‌వర్క్: పట్టణంలోని శుక్రవారం వివిధపార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మద్దూర్ మండలంలోని దమ్‌గాన్‌పూర్‌కు చెందిన సహకార సంఘం డైరెక్టర్ రాజురెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వ ర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరు

మరికల్: ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి విస్తుందని అధికార పార్టీ ఎన్ని ఎత్తులు వేసిన తమ కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరని బ్లాక్ కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరలుతో మాట్లాడారు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వారి కుటుంబంలో మాత్రం నలుగురికి ఉద్యోగాలు కల్పించిందన్నారు.

అభివృద్ధిచూసి ఆశీర్వదించండి

నర్వ/ఊట్కూర్: మండలంలో బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటువేయాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షురాలు చిట్టెం సుచరిత ఓటర్లను అభ్యర్థించారు. అలాగే ఊట్కూర్ మండలంలోని మల్లెపల్లిలో శుక్రవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని యువనాయకుడు చిట్టెం చాణిక్యారెడ్డి ఇంటింటి ప్రచారం చేసి ఓటర్లను కోరారు.

నష్టపరిహారం అందేలా కృషిచేస్తా..

మక్తల్: జూరాల, భూత్పూర్, సంగంబండ గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందేలా తనవంతు కృషిచేస్తానని కాంగ్రెస్ ఎమ్మె ల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరులలో సమావేశంలో ఆయన మాట్లాడారు.. నియోజకవర్గ ప్రజలు హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూపులు



పస్పులలోని బీసీకాలనీ స్థలంలో పాతిన హద్దురాళ్లు

మరికల్: ఇళ్ల స్థలాల కోసం ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా 30 ఏళ్ల నుంచి ఓ గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఇళ్ల పట్టాలను చేతిలో పెట్టిన అధికారులు హద్దులు చూపించకపోవడంతో అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కల ఏళ్ల నుంచి నిరాశే మిగిలింది. గ్రామానికి మంజూరైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లు సైతం మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పస్పులలో 1993లో ఇళ్లు లేని అర్హులైన 65 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం సర్వే నంబర్ 211లోని 3.19 ఎకరాలలో ఒక్కొక్కరికి 135 చదరపు గజాల చొప్పున ప్లాట్లను పంపిణీ చేసి పట్టాలు అందజేసింది. అయితే హద్దులు చూపించకపోవడంతో వారు ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా స్థలాలు చూపించి.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

కుక్క అడ్డురావడంతో బైక్ పైనుంచి పడి..

- చికిత్స పొందుతూ మహిళ మృతి

మహమ్మదాబాద్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓమహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన పుట్టి శంకరయ్య, శాంతమ్మ(48) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ, కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం దగ్గర్లో ఉన్న చౌదర్‌పల్లి సంతకు శాంతమ్మ, కుమారుడు అశోక్ ద్విచక్ర వాహనంపై కూరగాయలు తీసుకుని వెళ్లారు. మార్గమధ్యలో బోరింగ్ తండా సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా వారి వాహనానికి కుక్క అడ్డుగా వచ్చింది. ఈ క్రమంలో వారు బైక్ పైనుంచి కిందపడిపోయారు. ఘటనలో అశోక్‌కు స్వల్పగాయాలు కాగా, శాంతమ్మ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో ఆమెను మొదట ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం శాంతమ్మ మృతిచెందింది. ఘటనపై ఆమె భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమెప్పుడో..?

మాగనూర్: అధికారులు వరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం రైతులు అవి ఎప్పుడు ప్రారంభిస్తారోనని దీనంగా ఎదురుచూస్తున్నారు. గతమూడు రోజులుగా వాతావరణంలో మార్పుతో వర్షం ఎప్పుడు వస్తుందో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పొలాల వద్ద ఆరబెట్టిన ధాన్యం వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంట పండించడానికి పడిన బాధల కంటే చేతికి వచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడమే రైతుకు సవాలుగా మారింది. ముఖ్యంగా మండలంలో రైతులు ఇక్కడి ధాన్యం మొత్తాన్ని పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు లారీలో తరలిస్తున్నారు. ఇప్పటికైనా మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో సమీపంలో పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం

ఎక్సైజ్ దాడుల్లో నల్లబెల్లం పట్టివేత

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎక్సైజ్ డీఎస్పీ ఎల్ నర్సింహారెడ్డి



నాటుసారాను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

దామరగిద్ద: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ డీఎస్పీ ఎల్. నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దామరగిద్ద తాండ, వత్తుగుండ్ల తాండ గ్రామాల్లో ఎక్సైజ్ టీం ఆకస్మికంగా దాడులు చేశారు. ఇద్దరి వ్యక్తులతో 500 లీటర్ల నల్లబెల్లంపాకం, వందకేజీల నల్లబెల్లం , పది లీటర్ నాటుసారా పట్టుబడిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసార తయారీ, బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కోస్గి ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, నారాయణపేట ఎక్సైజ్ సీఐ కవిత, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



క్రీడాకారిణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ స్కూల్‌లో ఎనిమిదోతరగతి చదువుతున్న అర్చన ఈ నెల 13నుంచి 15వరకు తూప్రాన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నట్లు పీఈటీ కృష్ణవేణి తెలిపారు. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయురాలు, క్రీడాకారిణిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనకప్ప, డీఎస్ఓ భానుప్రకాష్, మాధవి, శోభారాణి, విజయ్, మధుసూదన్‌రావు, శిరీష, నిర్మల, సురేఖ, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు నమోదు



పాఠశాలలో ముఖ ఆధారిత నమోదును చేపడుతున్న హెచ్‌ఎం

నర్వ: డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థుల ముఖ హాజరు నమోదును చేపడుతున్నట్లు కల్వాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నకుమారి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో డీఎస్ఈ ఎఫ్ఆర్ఈ యాప్ ద్వారా ఆధార్ అనుసరించి విద్యార్థుల హాజరు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థిని తరగతి వెళ్లేముందు ముఖ ఆధారిత హాజరు నమోదును చేపడుతున్నామన్నారు. ఈ నమోదు ప్రక్రియను సీఆర్పీ నర్సింహులు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. అన్నిపాఠశాలలో నమోదు ప్రక్రియ కొనసాగుతున్నట్లు సీఆర్పీ పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

నారాయణపేట రూరల్: నారాయణపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నాడంటూ బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందునామాజీ స్థానిక ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీహర్షకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పింఛన్ లబ్ధిదారులకు ఉత్తరాలు రాస్తూ.. పింఛన్ తామే ఇస్తున్నామని, తమకే ఓటువేయాలని, లేకపోతే ఆగిపోతుందని భయపెడుతున్నట్లు ఫిర్యాదులో తెలియజేసినట్లు మీడియాకు వెల్లడించారు.

ఒకే భవనంలో పంచాయతీ, అంగన్‌వాడీ



మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో ఒకే భవనంలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. రెండుకలిపి ఒకే భవనంలో కొనసాగించడంతో పాలనపరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంగన్‌వాడీ పిల్లలు ఉంటే, గది ఆరు బయట పంచాయతీకి సంబంధించిన గ్రామసభలు, తదితర వ్యవహారాలను నడిపిస్తున్నారు. ఇలా రెండు ప్రభుత్వ కార్యాలయలు ఒకేగదిలో కొనసాగడంతో ఇబ్బందిగా మారిందని ఇరువురు శాఖల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం మంజూరు చేసేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



అశ్వినితో తల్లి సత్యమ్మ

దామరగిద్ద: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ చిన్నారికి గుండెజబ్బుతో ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో బిడ్డను బతికించుకోవాడానికి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. తమ బిడ్డ చికిత్స కోసం రూ. 5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక అపన్నహస్తంకోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని కాన్‌కుర్తికి చెందిన గటనోళ్ల సత్యమ్మ బందెప్పలకు మొదట కుమారుడు అనంతరం రెండో సంతానం కుమార్తె అశ్విని గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలో నాల్గోతరగతి చదువుతుంది. కాగా ఇటీవల గుండెనొప్పి రావడంతో ఆస్పత్రిలో వైద్యులకు చూయించగా గుండె జబ్బు ఉందని తేలింది. దీంతో తమ బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలని సినీనటుడు మహేష్ బాబు ఫౌండేష్ సాకారంతో హైదరాబాద్ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాగా చికిత్స అనంతరం అవసరమైన మందులు వైద్యఖర్చులకు ' రూ.5 లక్షలు అవసరం ఉండటంతో ఎలాగైనా తమ బిడ్డను కాపాడుకోవాలని దాతల సాకారం కోసం ఎదురుచూస్తున్నారు. తమవంతు సాయం అందించాల్సిన దాతలు ఫోన్‌పేలేదా గూగుల్ పే ద్వారా 7013243855 నంబర్‌కు సాయం అందించాలని వేడుకుంటున్నారు.